www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

శని వారం
04-02-2023
సంపుటి - 07,
సంచిక-250
పేజీలు - 4
వెల రూ. 5/-

ఎడిటర్ : పృద్వీరాజ్. జి
9581442622

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

మత్స్యశాఖ కమీషనర్, జేడీల కనుసన్నల్లోనే !



1,2వ పేజీలో..

# తెలంగాణలో అద్భుత ప్రగతి

## అసెంబ్లీ ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగం





- రెండేళ్ల తరవాత అసెంబ్లీకి గవర్నర్ రాక
- తమిళసైకి స్వయంగా స్వాగతం పలికిన కెసిఆర్
- అన్నిరంగాల్లోనూ గణనీయమైన ప్రగతి
- విద్యుత్, తాగు,సాగునీటి రంగాల్లో విప్లవం
- దేశానికి ఆదర్శంగా నిరంతర విద్యుత్
- పచ్చగా కళకళలాడుతున్న తెలంగాణ గ్రామాలు
- అంబేద్కర్ స్ఫూర్తితో దళితుల స్వాలంబన అభివృద్ధికి కృషి
- కెసిఆర్ దక్షతకు తెలంగాణ సర్వతో ముఖాభివృద్ధి

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని గవర్నర్ తమిళిసై అన్నారు. దేశ ధాన్యాగారంగా తెలంగాణ ఆవిర్భవిస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ పరిపాలన దక్షత, ప్రజా ప్రతినిధుల కృషితో రాష్ట్రం ముందుకెళ్తోందన్నారు. తెలంగాణ అపూర్వ విజయాలను సాధించిందన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో తెలంగాణ విరాజిల్లుతోందని, తాగునీటి సమస్యల కోసం తల్లడిల్లిన పరిస్థితుల నుంచి తెలంగాణ బయటపడిందని తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికి ఉచిత తాగునీటి సరఫరా జరుగుతోందని అన్నారు. ఒకప్పుడు పాడుబడిన తెలంగాణ గ్రామాలు ఇప్పుడు కళకళలాడుతున్నాయని హార్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో దళితుల స్వాలంబన అభివృద్ధికి కృషి జరిగిందని తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సీఎం కేసీఆర్ సారధ్యంలోని తెలంగాణ ప్రభుత్వం, గవర్నర్ తమిళిసై మధ్య కొంతకాలంగా మాటల యుద్ధం.. కోర్ట్ జోక్యంతో బడ్జెట్ సమావేశాలకు ఆహ్వానం.. గవర్నర్ ఏం మాట్లాడబోతున్నారనే ఉత్కంఠ పరిణామాల మధ్య తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి

3వ పేజీలో...

## యాదాద్రిని దర్శించుకున్న గవర్నర్ తమిళిసై



**యాదాద్రి, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ దర్శించుకున్నారు. ఉదయం కొండపైకి చేరుకున్న గవర్నర్‌కు కలెక్టర్ పమేలా సత్పతి, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్ద ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నేరుగా స్వయంభు ఆలయంలోకి వెళ్లిన గవర్నర్.. లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు గవర్నర్‌కు ఆశీర్వచనం చేశారు. అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## భారీగా పెరిగిన అమూల్ పాల ధరలు

వెంటనే అమల్లోకి వచ్చినట్లు ప్రకటన




**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** దేశంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి సంస్థ 'అమూల్' కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం నుంచి అమూల్ పాలు లీటరుపై రూ.3 పెంచుతున్నట్లు గుజరాత్ డెయిరీ ప్రకటించింది. తాజా పెంపుతో.. అమూల్ గోల్డ్ పాలు లీటరు రూ. 66, అమూల్ తాజా పాలు లీటరు రూ.54, అమూల్ ఆవు పాలు లీటరుపై రూ.56 చెల్లించాల్సి ఉంటుంది. ఇక

3వ

## ఆ శాఖపై నిఘా కరువు

## అవినీతి అధికారుల పైసా వసూల్

### మత్స్యశాఖ స్పెషల్ డ్రైవ్, కమిటీల పేరిట నిలువు దోపిడి

### కమీషనర్, జేడీల కనుసన్నల్లోనే !



- కాంట్రాక్టర్లతో అధికారుల కుమ్మక్కు
- పంపిణీ చేయకున్నా అడ్డగోలు బిల్లులు
- కమీషనర్, జేడీల కనుసన్నల్లోనే అవినీతి !
- వసూళ్లకు అలవాటుపడ్డ తెలంగాణ మత్స్యశాఖ ఉన్నత అధికారులు
- తెలంగాణ వ్యాపితంగా ఎక్కువ శాతం డిప్యుటేషన్‌పైనే డిఎఫ్‌ఓలు
- సెకండ్ డ్రైవ్ పేరిట వసూళ్లు షురూ
- ముదిరాజ్, బెస్త మత్స్యకారులకు తిప్పలు
- అధికారులపై విచారణ జరిపించాలని డిమాండ్

తెలంగాణ మత్స్యశాఖలో అవినీతి బాగోతం బట్టబయలైంది. గత కొంత కాలంగా అన్ని జిల్లాల్లో డిఫ్ఓలకు టార్గెట్ పెట్టి స్పెషల్ డ్రైవ్, కమిటీల పేరిట సొసైటీలు ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారులు ఆదేశించారు. సొసైటీల సభ్యుల నుంచి లక్షల్లో వసూలు చేయాలని ఉన్నత అధికారులు అనధికారికంగా హుకూం జారీ చేయడం గమన్హం. అంతే కాదు కాంట్రాక్టర్లతో కుమ్మకై తక్కువ ధరకు నాసిరకం రొయ్య సీడ్‌ను సప్లై చేస్తూ లెక్కల్లో ఎక్కువ సీడ్ సప్లై చేస్తున్నట్లు కాగితంపై చూపిస్తూ అధికారులే కోట్లు దండుకుంటున్నారు. ఈ తతంగమంతా కమీషనర్, జేడీల ఆధ్వర్యంలో వసూళ్ల పర్వం నడుస్తున్నట్లుగా విమర్శలున్నాయి.

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రంలో మత్స్యశాఖ ఉచిత చేప పిల్లల పంపణీ పథకం చేపడుతుంది. 2022-2023 సంవత్స రానికి గాను తెలంగాణ అన్ని జిల్లాల్లో కోట్లల్లో చేప పిల్లల పంపణీ చేయాలని లక్ష్యం

2వ పేజీ లో...

## 6న బడ్జెట్

### ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి

### నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** ఈ నెల 6న ఆర్థిక మంత్రి హరీష్‌రావు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ మేరకు బిఎసి సమావేశంలో నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాల నిర్వాహణపై స్పీకర్ పోచారం అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో సమావేశాల నిర్వహణపై చర్చించారు. శనివారం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చేపట్టాలని నిర్ణయించారు. 7న అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 8న బడ్జెట్, పద్దులపై చర్చించనున్నారు. 25 రోజుల పాటు బ్జడెట్ సమావేశాలు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో కాంగ్రెస్ కోరినట్లు తెలుస్తోంది. భేటీలో భట్టి విక్రమార్క ప్రొటోకాల్ సమస్యను ప్రస్తావించినట్లు సమాచారం. చాలా సమస్యలపై చర్చ జరగాల్సి ఉందన్న విషయాన్ని ఆయన గుర్తు చేయగా.. బడ్జెట్ పై చర్చ అనంతరం మిగతా అంశాలపై చర్చిద్దామన్న ప్రభుత్వం చెప్పినట్లు తెలుస్తోంది.



## ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి నివాసాల్లో సోదాలు

నాలుగోరోజు కొనసాగిన ఐటి దాడులు





**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, సిద్దిపేట మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఆయన బంధువులు, పీఏ నివాసాల్లో వరుసగా నాల్గో రోజు ఐటీ సోదాలు కొనసాగాయి. ఉదయమే సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని రాజపుష్ప విల్లాస్ కు చేరుకున్న అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఐదేళ్ల ఐటీ రిటర్న్ తో పాటు

3వ

## విశ్వనాథ్ మృతికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు సంతాపం

### ఆయన మరణం తెలుగుజాతికి తీరని లోటని నివాళి



**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** విశ్వనాథ్ మృతికి తెలంగాణ మంత్రులు సంతాపం తెలిపారు. దర్శకుడు కె.విశ్వనాథ్ మరణం పట్ల తెలంగాణ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశ్వనాథ్ మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరనిలోటన్నారు. ఈ

3వ

## బిబిసి డాక్యుమెంటరీ నిషేధంపై విచారణ



### కేంద్రానికి సుప్రీం నోటీసులు..

### 3 వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రధాని మోడీపై బీబీసీ డాక్యుమెంటరీని కేంద్రం నిషేదించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై సుప్రీంకోర్టు శుక్రవారం విచరణకు చేపట్టి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. బీబీసీ డాక్యుమెంటరీ ఇండియా ది క్వశ్చన్ ను నిషేధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీం విచారణ జరిపింది. పిటిషన్లను విచారించిన సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం 3 వారాల్లోగా వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను ఏప్రిల్ లో విచారిస్తామని చెప్పింది. 2002 గుజరాత్ అల్లర్లపై రూపొందించిన వివాదాస్పద బీబీసీ డాక్యుమెంటరీని నిషేధిస్తూ కేంద్రం కొన్ని రోజుల క్రితం నిర్ణయం తీసుకుంది. అయితే ప్రముఖ జర్నలిస్ట్ ఎన్

3వ

## మాజీ సిఎస్ సోమేశ్‌కు హైకోర్టు వారెంట్



**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** రాష్ట్ర మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌కు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో

3వ

# సంపాదకీయం

## అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు

అంబేద్కర్ మహాశయుడు అందించిన రాజ్యాంగం పాలకులు తమకు అనుకూలంగా మార్చుకుని పాలన చేస్తారని బహుశా ఊహించి ఉండరు. పేదలు పేదలుగానే ఉంచేలా పథకాలో మోసం చేస్తారని అనుకుని ఉండరు. నిజంగా ఆయనో 25 ఏళ్లలో అద్భుత భారతం ఆవిష్కృతం అవుతుందని రాజ్యాంగ రచన సందర్భంగా భావించి ఉంటారు. కానీ అలా జరగలేదు. అందుకు తాజా పరిస్థితులే నిదర్శనం. నిజానికి ఇంకా మన నేతలు పేదలగురించి, ఉచిత పథకాల గురించి మాట్లాడడమే తప్ప వారి ఉన్నతికి ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే కులవ్యవస్థను వ్యతిరేకిస్తున్న వారంతా మళ్ళీ కుల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నారు. కులాల వారిగా సమాజాన్ని విభజించి పథకాలు అమలు చేస్తున్నారు. నిజంగగా ఇలాంటి పరిస్థితి వస్తుందని బహుశా ఆ మహాను భావుడు ఊహించ ఉండరు. రాజ్యాంగం ఇంతకాలం కేవలం రాజకీయనాయకుల అవసరాలను మాత్రమే తీర్చింది. పెత్తందారీలకుమాత్రమే మేలు చేసింది. బడాబాబులను మరింత పెద్దవారుగా ఎదగడానికి దోహదపడింది. సామాన్యులు సామాన్యులగానే ఉండి పోయారు. నిరంతరాయంగా రాజకీయ నేతలు పదవులు పట్టుకుని వేలాడడం వల్లనే రాజ్యాంగం అపహాస్యం అవుతోంది. పేదలకు రక్షణ కల్పించలేక పోతున్నది. రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా పాలన చేస్తున్నారు. తాము చెప్పిందే రాజ్యాంగం అన్నరీతిలో సాగుతున్నారు. అందరికీ సమాన స్థాయిలో నాణ్యమైన విద్య,వైద్యం, ఉద్యోగ,ఉపాధి అవకాశాలను అందివ్వలేకపోవడం వల్ల రాజ్యాంగం అపహాస్యం అవుతోంది. ఇది రాజకీయ నాయకుల కురుచ బుద్ధి వల్ల, స్వార్థం వల్ల, అధికార యావ వల్ల అని తేలింది.అందుకు కారణం రాజకీయాలే అని విద్యావేత్తలు, ఆర్థిక నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు ఇప్పుడు బల్లగుద్ది మరీ చెబుతున్నారు. విద్య, ఉద్యోగం,వైద్యం వంటి వాటిల్లో ఖచ్చితమైన హామిని పొందలేకపోయారు. ఇవన్నీ చర్చించాల్సిన సమయం ఇప్పుడు వచ్చింది. రాజ్యంగం లో ఉన్న అంశాలను చర్చించాలి.ఎక్కడ మనం విఫలం అయ్యామో చర్చించాలి. కారకులు ఎవరో తేల్చాలి. రాజ్యాంగం అంటూ మార్చాల్సి వస్తే రాజకీయ నాయకుల పెత్తనం లేకుండా ఉండేలా చూసుకోవాలి. రాజ్యాంగం అంటే శిలాశాసనంగా ఉండాలి. దానిని కాదని పక్కకు తొలగితే ఉరివేసే విధంగా శిక్షలు ఉండాలి. భయం ఉంటే తప్ప ప్రజలకు న్యాయం జరగదు. నిజానికి రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరంపై చర్చచేయాలి. రాజకీయ నాయకుల అభీష్టం మేరకు కాకుండా ప్రజల ఆలోచ నలకు అనుగుణంగా, సమాజాంలో అసవరాలకు అనుగుణంగా..మారిన ప్రపంచ గతికి అనుగుణంగా మన రాజ్యాంగాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఒకే వ్యక్తి జీవిత పర్యంతం పదవులను పట్టుకుని వేలాడే పద్దతి పోవాలి. రిజర్వేషన్లు ఒకే కుటుంబంలో జీవితాంతం అనుభవించే దశ పోవాలి. 140 కోట్ల మందికి అనుగుణంగా రాజ్యాంగం మారాలి. అంతరికీ సమాన ఫలాలు దక్కేలా చట్టాలు ఉండాలి. రిజర్వేషన్ల ఫలాలు అన్ని కుటుంబాలకు వరుసగా అందాలంటే ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రెండు పర్యాయాలు మాత్రమే దక్కాలి. రాజకీయంగా కూడా రిజర్వేషన్లు రావాలి. సర్పంచ్ మొదలు ఎంపిలు, ఎమ్మెల్యేల వరకు ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి పదవిలో ఉండకుండా.. అమెరికా అధ్యక్ష పాలన తరహాలో రిజర్వేషన్లు ఉండాలి. అప్పుడు ప్రజలకు మరిన్ని అవకాశాలు వస్తాయి. నేతలుతమకు అనుకూలంగా చెప్పినట్లుగా కాకుండా..రాజ్యాంగం మేధావుల సమక్షంలో ప్రజల అభీష్టం మేరకు మార్పులు,చేర్పులు జరగాలి. ప్రస్తుత రాజ్యాంగం మూలాలను విడవకుండా ఇందుకు సిద్దపడాలి. అలా చేయడం ద్వారా ప్రజలకు రాజ్యాంగ రక్షణ దక్కగలదు. పేదరికంపై విజయం సాధించ గలిగే చర్యలు జరగడంలేదు. నిర్ణయాలు ఉండడం లేదు. ప్రజలందరికీ

నాణ్యమైన విద్యను అందించలేని జాతీయ విద్యావిధానం అవసరమా అన్నది చర్చించాలి. ఉద్యోగాలు కల్పించలేని చదువులు అవసరమా అన్నది చర్చించాలి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన దగ్గర్నుంచీ లెక్కలేసుకుంటే ప్రజలకన్నా వ్యాపారులు, కార్పోరేట్లు, రాజకీయ నేతలే బాగుపడ్డారు. వారికోసం ప్రజల జీవితాలను పణంగా పెడుతూ వస్తున్నారు. ఓట్లను కొల్లగొట్టి అధికారం చెలాయిస్తున్నారు. నీతి వాక్యాలు ప్రవచిస్తున్న రాజకీయ నాయకులు అంతా ఇందుకు అతీతం కాదు. రాజ్యాంగం పటిష్టంగా ఉండి..రాజకీయ నాయకుల పెత్తనం లేకుంటే ఇలా జరిగేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. పాలకులు అంటే పన్నులు వేయడం..తాము అనుకున్న పనులు చేసుకోవడం...దర్జాగా ఎసి గదుల్లో సుఖాలు అనుభవించడం.. ప్రత్యేక విమానాల్లో విహారాలు చేయడం వంటివన్నీ ప్రజల జీవితాలను పణంగా పెట్టి చేయాల్సిన ఆగత్యం ఉందా అన్నది ఆలోచనచేయాలి. గత రెండేళ్లుగా పార్లమెంట్ సమావేశాలు సరిగా సాగడం లేదు. దాదాపు ప్రతి సమావేశంలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చూస్తున్నాం. పార్లమెంట్ సాగకపోవడం అన్నది ఎందుకన్న ఆలోచన చేసేదెవరు. నిజానికి ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు ప్రభుత్వం జవాబు చెబుతూనే పార్లమెంట్‌ను సజావుగా నడిపించే అవకాశాలున్నాయి. ధరల పెరుగుదల, నిరుద్యోగం,మద్దతు ధరలు, రైతుల సమస్యలు, చర్చ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. మన రాజ్యాంగం పటిష్టంగా ఉన్నా వీటిపై చర్చ జరగక పోవడానికి గల కారాణాలు ఏమిటన్నది ముందు చర్చించాలి. అంటే రాజకీయపెత్తనమే దీనికి కారణమని అర్థం అవుతోంది. ఇలా జరగడం అసవరమా అన్నది ముందుగా ఆలోచనచేయాలి. ఈ క్రమంలో రాజ్యాంగాన్ని పటిష్టం చేసుకోవాలన్న విషయంలో చర్చ చేయాలి. అది ప్రజలకు ఎలా ఉపయోగ పడగలదో ప్రజాభిప్రాయం తీసుకోవాలి. రాజ్యాంగాన్ని రద్దు చేయాలనే కొందరి కుట్రలను భగ్నం చేయాలి. రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారన్న వారు.. తమ వైఫల్యాలను ప్రజల ముందుంచాలి. ప్రజలకు లేదా సామాన్యులకు తమపాలనా కాలంలో ఎలా న్యాయం చేశారో చెప్పాలి. దేశ ప్రజలకు ఏమాత్రం మేలు జరగక పోవడానికి ఎవరు కారణమో చర్చించాలి. ఎస్సీ, ఎస్టీల జీవితాలుఎందుకు బాగుపడడం లేదో చర్చించాలి. విద్యా,వైద్యంలో ఎందుకు ముందుకు వెళ్లలేదో చర్చించాలి. అప్పుడే వైణల్యం ఎక్కడ ఉందో గుర్తించ గలం. అప్పుడే ముందుకు సాగగలం.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# బయట పులి..అసెంబ్లీలో పిల్లి

## గవర్నర్ తమిళసైపై జగ్గారెడ్డి విసుర్లు



**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** బయట పులిలా గర్జించిన గవర్నర్.. అసెంబ్లీలో పిల్లిలా ప్రసంగించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. అలా మాట్లాడకపోతే ఆమె మైక్ కూడా కట్ అవుతుందన్నారు. శాసనసభలో కనబడాలనుకున్నారు.. కనిపించారు.. అంతే అన్నారు. గవర్నర్ తమిళిసై ప్రసంగంపై కీలక జగ్గారెడ్డి వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన డైరెక్షన్‌లో గవర్నర్ నడిచారని, తప్పనిసరి పరిస్థితుల్లో సీఎం కేసిఆర్, గవర్నర్ తమిళిసై మధ్య రాజీ కుదిరిందని.. చివరకు తుస్సుమనిపించారన్నారు. సీఎం కేసీఆర్ డైరెక్షన్‌లోనే గవర్నర్ నడవక తప్పలేదని విమర్శించారు. కాగా అసెంబ్లీలో గవర్నర్ తమిళి సై ప్రసంగంపై ప్రభుత్వవర్గంలో చర్చ జరిగింది. ప్రసంగం చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. అయితే ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగం కాపీలోని అంశాలను మాత్రం గవర్నర్ ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, విధానాల ప్రస్తావన లేకుండానే గవర్నర్ ప్రసంగం కొనసాగింది. దీంతో ప్రభుత్వ వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి.

# ఉన్నత చదువుకు పేదరికం అడ్డుకాకూడదు

**విదేశీ వర్సిటీల్లో 213 మంది విద్యార్థులకు అడ్మిషన్లు**

**జగనన్న విదేశీ విద్యా దీవెన కింద రూ. 19.95 కోట్లు సమ**

**ఓ మంచి కార్యాక్రమాన్ని చేపట్టామన్న సిఎం జగన్**



**అమరావతి, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న విదేశీ విద్యా దీవెన కింద నిధులను ప్రభుత్వం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు ఉచిత విదేశీ విద్యను అందిస్తున్న విషయం తెలిసిందే.అంతర్జాతీయ స్థాయిలో టాప్-200 వర్సిటీల్లో ఉచిత ఉన్నత విద్య అడ్మిషన్లు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడతలో సాయంగా రూ. 19.95 కోట్లను బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లోకి డబ్బులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మాట్లాడుతూ.. జగనన్న విదేశీ విద్యా దీవెన రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం అన్నారు. మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పేద విద్యార్థులు ప్రపంచంలోనే టాప్ వర్సిటీల్లో చదువుకునే అవకాశం కల్పించామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల పేద విద్యార్థులకు అవకాశం ఇచ్చామని తెలిపారు. ఉన్నత చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్నారు. పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువేనని అన్నారు. విదేశీ వర్సిటీల్లో 213 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారని తెలిపారు. వీరికి తొలివిడతగా రూ.19.95 కోట్ల సాయం అందిస్తున్నామని సిఎం తెలిపారు. ప్రపంచ వేదికపై దేశం, ఆంధ్ర రాష్ట్ర జెండా ఎగురవేయాలని, మన పిల్లలు ప్రపంచ స్థాయిలో రాణించాలని జగన్ ఆకాక్షించారు. విద్య మీద పెట్టే ప్రతి పెట్టుబడి కూడా మానవ వనరుల మీద పెట్టినట్టేనన్నారు. మహాత్మ గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, అంబేద్కర్ వంటి వాళ్లు పెద్ద యూనివర్శిటీల నుంచి వచ్చినవారేనని, అందుకే పిల్లలు చదువు కునేలా అడుగులు వేయిస్తున్నామని సిఎం తెలిపారు. గతంలో కేవలం రూ. 10లక్షలు మాత్రమే ఇచ్చే వారనీ, 2016-17కి సంబంధించి రూ.300 కోట్లు బకాయిలు పెట్టారని సిఎం జగన్ తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్లు, మిగిలిన విద్యార్థులకు గరిష్టంగా రూ.కోటి వరకు సాయం అందిస్తున్నామని తెలిపారు. ట్యూషన్ ఫీజు వందశాతం రీయింబర్స్‌మెంట్స్ ఇస్తున్నామన్నారు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే సీఎంఓలో అధికారులు అందుబాటులో ఉంటారనీ, ఇబ్బంది ఉంటే వెంటనే కాల్ చేయాలని ముఖ్యమంత్రి జగన్ సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సురేశ్, వెల్లంపల్లి శ్రీనివాస్,మాజీమంత్రి ధర్మాన కృష్ణదాస్, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టుకు మరో ఐదుగురు జడ్జీలు






**కొలీజియ సిఫార్సుల మేరకు నిర్ణయం**

**సుప్రీంకు తెలిపిన అటార్నీ జనరల్**

**ఆమోదంలో ఆసల్యంపై మండిపడ్డ ధర్మాసనం**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** త్వరలో ఐదుగురు నూతన జడ్జీలను నియమకానికి కేంద్రం గ్రీన్‌సిగల్ ఇవ్వనుంది. జడ్జీల నియామకంలో జాప్యంపై దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. కొలీజియం సిఫారసు చేసిన ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఇద్దరు న్యాయమూర్తులను సుప్రీంకోర్టుకు పదన్నోతి కల్పించే అంశాన్ని క్లియర్ చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఐదుగురు జడ్జీల నియామకంపై త్వరలో స్పష్టత వస్తుందని కేంద్రం వెల్లడించింది. దీంతో సిజెఐతో కలిపి సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యా బలం 32కి చేరుతుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 27 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ÷ాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిథాల్, పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజరు కరోల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.వి. సంజరు కుమార్, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అసదుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ మిశ్రాలను సుప్రీంకోర్టుకు గతేడాది డిసెంబర్ 13న కొలీజియం సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. ఐదుగురు హైకోర్టు న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పిస్తూ 2022 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు కేంద్రం త్వరలోనే క్లియరెన్స్ ఇవ్వనున్నట్టు భారత అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి శుక్రవారంనాడు అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న కొలీజియం సిఫార్సుల తాజా పరిస్థితిపై సుప్రీంకోర్టు ధర్మాసనం అడిగిన ప్రశ్నకు ఏజీ సమాధానమిస్తూ, జడ్జీల నియామకాలను ఆదివారంనాడు జారీ చేయనున్నట్టు కోర్టుకు తెలిపారు. న్యాయ నియామకాలపై కేంద్ర ఎలాంటి టైమ్-లైన్ పాటించడం లేదంటూ బెంగళూరు అడ్వకేట్స్ అసోసియేషన్ వేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. డిసెంబర్‌లో 5 పేర్లు ప్రతిపాదించాం. ఇప్పుడు మనం ఫిబ్రవరిలో ఉన్నాంఅని విచారణకు హాజరైన ఏజీని ఉద్దేశించి జస్టిస్ కౌల్ అన్నారు. ఆ పేర్లను క్లియర్ చేయాల్సి ఉంటుందని న్యాయమూర్తి అన్నారు. ఎప్పుడు వారెంట్లు ఇష్యూ చేస్తారని ప్రశ్నించారు. దీనిపై ఏజీ సమాధానమిస్తూ, ఆదివారంనాడు జారీ చేస్తారని తెలుస్తోందని, ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద ఇవి ఉన్నాయని, శుక్రవారం సాయంత్రానికి క్లియెరెన్స్ ఇచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని అన్నారు. దీనిపై జస్టిల్ కౌల్ స్పందిస్తూ, సుప్రీంకోర్టు సిఫార్సు చేసిన ఐదుగురు పేర్లు పరిశీలనలో ఉన్నాయని అటార్జీ జనరల్ కోర్టుకు వివరించినందున గరిష్టంగా ఐదు రోజుల్లోగా నియామాకాలు జారీ చేయాల్సి ఉంటుందని అన్నారు. అయితే ఉత్తర్వుల్లో ఎన్ని రోజులనే దానిని రికార్డు చేయవద్దని, ఆదివారంనాటికి వారెంట్లు జారీ అవుతాయని అన్నారు. ఇది చాలా సీరియస్ అంశమని, నియామకాల్లో జరుగుతున్న తీవ్ర జాప్యాల కారణంగా ధర్మాసనం ఇబ్బందికరమైన నిర్ణయం తీసుకునే పరిస్థితి కల్పించవద్దని ఆయన జస్టిల్ కౌల్ స్పష్టం చేశారు. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదా వేశారు.

# గవర్నర్ ప్రసంగంలో గొప్పలు తప్ప..ఏమీ లేదు

**24 గంటల కరెంట్ ఎక్కడుందో చెప్పాలి**

**పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదు**

**ధరణిపై ఎందుకు ప్రస్తావించలేదు: ఈటెల విమర్శలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** ప్రభుత్వం చేసిన తప్పులను గవర్నర్‌తో చెప్పించారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మండిపడ్డారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఎక్కడ ఇస్తున్నారని ప్రశ్నించారు. పంటలు ఎండిపోతున్నాయన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆరు గంటల కరెంట్ కూడా రావట్లేదని రైతులు సబ్ స్టేషన్లో వద్ద ఆందోళన చేస్తున్నారని చెప్పారు. గవర్నర్ ప్రసంగంలో అనేక అబద్దాలు ఉన్నాయని మీడియా పాయింట్ వద్ద ఆమాట్లాడుతూ ఈటెల మండిపడ్డారు. ధరణి గురించి ఎందుకు ప్రస్తావించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రసంగంలో ధరణి ప్రస్తావన లేదన్న ఈటల.. ప్రభుత్వం ఇచ్చిన ప్రతిని మాత్రమే గవర్నర్ చదివారని ఆక్షేపించారు. ధరణితో అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నా.. ఆ విషయంపై నోరు మెదపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిధులతో మాత్రమే అర్బన్ ప్రాంతంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించారని చెప్పారు. గజ్వేల్ సిద్దిపేట తప్ప ఎక్కడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించలేదని మండిపడ్డారు. ధరణీ, డబుల్ బెడ్ ఇళ్లు రాకపోవడంతో చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్న ఈటల.. గొప్పలు చెప్పుకోడానికి మాత్రమే ఈ ప్రసంగం పనికి వస్తుందని తీవ్ర విమర్శలు చేశారు.కాగా.. తెలంగాణ రాష్ట్రం దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా విలసిల్లుతోందన్న గవర్నర్.. సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. రైతుబంధు పథకం ప్రపంచవ్యాప్త ప్రశంసలు పొందిందన్నారు. కొత్త సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి, దేశంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నిర్మిస్తున్నారని వివరించారు.

## ఆ శాఖపై నిఘా కరువు

(మొదటి పేజి తరువాయి) ఉంది. అయితే అధికారుల చేతివాటం కారణంగా ప్రభుత్వం అనుకున్న లక్ష్యనికి చేరుకోలేకపోతుంది. రాష్ట్రవ్యాపితంగా చేప పిల్లలను సరఫరా చేసే బాధ్యతను అప్పగించడంతో కాంట్రాక్టర్లు అధికారులు కలిసి అవినీతికి తెరలేపారు. దీనితో అధికారుల పర్యవేక్షణ లేక దొంగ లెక్కలతో మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా కోట్ల రూపాయలను దండుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. మరోవైపు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల నుంచి నేరుగా సొసైటీ చెరువుల వద్దకు రవాణా చేయాల్సిన కాంట్రాక్టర్లు మత్యకారులే తీసుకువెళ్లాలని హుకూం జారీ చేస్తున్నారు. సీడ్స్ విషయంలో మంచి నీటి రొయ్యలకు బదులు మాంసాహర రొయ్యలను సరఫరా చేయటం, పెద్ద సైజు రొయ్య సీడ్ కాకుండా చిన్న సైజును సప్లై చేయటంతో సొసైటీ మత్స్యకారులు రిటర్న్ చెయ్యలేక నష్టపోతున్నారు.

**నీలికంఠ రొయ్య బదులు**

జలాశయంలో వదిలే సమయంలో సాంపిల్ లో చూపే విధంగా కాకుండా నాసిరకం రొయ్యలను సప్లై చేస్తూ మత్యకారులను మోసం చేస్తున్నారు. మంచినీటి రొయ్యలకు బదులు మల్కంసోనిలను నీటిలోకి వదులుతున్నారు.

**కమీషనర్ కమీషన్‌లు, జేడీల ఆదేశాలు**

ఆయా కాంట్రాక్టర్లు రొయ్యలను పంపణీ చేసే క్రమంలో జిల్లా అధికారులకు ముడుపులు అప్పజెప్పితే, ఆ ముడుపులను ప్రధాన కార్యాలయంలోని కమీషనర్, జేడీలకు ముడుపుల రూపం లో కోట్లల్లో వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తుంది.

**విజిలెన్స్ దృష్టి పెట్టాలి**

మత్స్యశాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విజిలెన్స్, ఏసీబి దాడులు చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ లో ఉన్న పలు సొసైటీల మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. (మిగతా కథనం రేపటి సంచికలో)

# నోరు అదుపులో పెట్టుకో షర్మిలమ్మా..!

## స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన ఎంపి మాలోత్ కవిత



**మహబూబాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల నోరు అదుపులో పెట్టుకోవాలని బీఆర్ఎస్ ఎంపీ మాలోత్ ఘాటుగా విమర్శించారు. సీఎం కేసీఆర్ పై నోటికొచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. షర్మిల పాదయాత్రల కాకపోతే మోకాళ్ల యాత్ర చేసుకోవాలని సూచించారు. కానీ సీఎం కేసీఆర్‌ను తిడితే మాత్రం చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గిల్లికజ్జాలు పెట్టుకోవాలని చూసే బుద్ధిని షర్మిల మార్చుకోవాలని కవిత హితవు పలికారు. గాలిమాటలు మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించిన ఆమె.. షర్మిల పద్ధతి మార్చుకోకుంటే ప్రజలే తరిమికొడతారని అన్నారు.




# ఈ ఎన్నికల్లో మరోమారు మోసపోవద్దు

**రైతులను దగా చేసిన కెసిఆర్‌కు బుద్ధి చెప్పాలి● పాదయాత్రలో వైఎస్ షర్మిల విమర్శలు**



**వరంగల్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** తెలంగాణలో అప్పు లేని రైతు లేదని వైఎస్ఆర్టీపీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. రైతు రుణమాఫ్ఫ పేఉతో మోసం చేశారని మండిపడ్డారు. రెండోరోజు వరంగల్ జిల్లా నెక్కొండ నైట్ క్యాంప్ నుంచి పాదయాత్ర ప్రారంభించిన వైఎస్ షర్మిల.. ఏబీ తండాలోని కూలీలతో మాట్లాడారు. అనంతరం పంటలు దిగుబడి, మద్దతు ధర ఎలా ఉందంటూ అడిగి తెలుసుకున్నారు. తొమ్మిదేళు ్లగా కేసీఆర్ తెలంగాణ ప్రజలను మాటలతో మోసం చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. డబుల్ బెడ్ రూం అని చెప్పి రాష్ట్రంలో పేదలను మోసం చేశారన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అనేది కూడా మోసమేనన్న షర్మిల... రాష్ట్రంలో సర్కార్ బడులు బంద్ పెట్టే పరిస్థితిలో ఉన్నాయని చెప్పారు. మూడు ఎకరాల భూమి మోసం, పోడు పట్టాలు అని మోస అంటూ ధ్వజమెత్తారు. రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేస్తున్నారని, 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ 8 ఏళ్లలో ఉద్యోగాలు లేక వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. బంగారు తెలంగాణ కేసీఆర్ కుటుంబానికి అయిందంటూ మండిపడ్డారు. ఒకప్పుడు స్కూటర్ లో తిరిగే కేసీఆర్.. ఇప్పుడు విమానాల్లో తిరుగుతున్నారని, ప్రజల సమస్యల కోసం మాత్రం కేసీఆర్ బయటకు రాడని విమర్శించారు. కేవలం ఓట్ల కోసం మాత్రమే బయటకు వస్తాడన్న షర్మిల.. . ఎన్నికలయ్యాక మళ్ళీ తిరిగి కూడా చూడడని ఆరోపించారు. 'ఈ సారి ఎన్నికలు ఉన్నాయి.. కేసీఆర్ మళ్ళీ వస్తాడు.. ఆకాశంలో చందమామ అంటాడు' అని షర్మిల సెటైరికల్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ సర్కార్ కూలిపోవాలని, కేసీఆర్ ఫామ్ హౌజ్ కే పరిమితం కావాలని ఆకాంక్షించారు. ప్రజల కష్టాలు చూస్తూ 3500కి.మీ. పాదయాత్ర చేశానన్న ఆమె... వైఎస్సార్ పాలనను మళ్లీ ప్రతి గడపకు చేరుస్తమని హామీ ఇచ్చారు. . వ్యవసాయాన్ని పండుగ చేస్తామని, ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు మహిళ పేరు మీద కట్టిస్తమని చెప్పారు. వైఎస్సార్ ప్రతీ పథకానికి జీవం పోస్తామన్న షర్మిల.. మొదటి సంతకం ఉద్యోగాల మంజూరు మీదనే పెడతానని ప్రామిస్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయి పెన్షన్ లు అందజేస్తామని స్పష్టం చేశారు.

# భారీగా పెరిగిన అమూల్ పాల ధరలు




(మొదటి పేజీ తరువాయి) అమూల్ ఏ2 గేదె పాల ధర లీటరు రూ.70కు పెంచుతూ అమూల్ డెయిరీ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం నుంచి దేశవ్యాప్తంగా పెరిగిన అమూల్ పాల ధరల జాబితాను గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ సేల్స్ సీనియర్ మేనేజర్ ప్రకాష్ ఔటే విడుదల చేశారు. కాగా, గతంలో అమూల్ 2022లో పాల ధరను మూడుసార్లు పెంచిన విషయం తెలిసిందే. గతేడాది మార్చి, ఆగస్టు, అక్టోబర్‌లలో పాలధరను పెంచింది. పెరుగుతున్న ధరల దృష్ట్యా పాల ధరను పెంచినట్లు కంపెనీ తెలిపింది. గతంలో సాధారణంగా లీటరుకు రూ.2 పెంచగా.. ఈసారి ఏకంగా మూడు రూపాయలు పెంచేసింది.

# తెలంగాణలో అద్భుత ప్రగతి





(మొదటి పేజీ తరువాయి) కేసీఆర్ నమస్కరించి గవర్నర్ తమిళిసైకి స్వయంగా స్వాగతం పలికారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై తెలుగులో కాళోజీ మాటలను ప్రస్తావిస్తూ ప్రసంగం మొదలుపెట్టారు. తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామం మారింద న్నారు. పచ్చదనంలో ప్రపంచ దేశాల ప్రశంసలు పొందుతోందని, దేశం నివ్వరబోయే అద్భుతాలను తెలంగాణ ఆవిష్కరిస్తోందని తమిళిసై అన్నారు. అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ ఎదిగిం దన్నారు. వ్యవసాయరంగంలో గొప్ప స్థిరీకరణను తెలంగాణ సాధించింది. భారీ, మధ్య, చిన్న తరహా ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేసింది. 73 లక్షల 33 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగింది.రైతుబంధు పథకం ప్రపంచవ్యాప్త ప్రశంసలు పొందుతోంది. పంటపెట్టుబడి సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. 65 లక్షల మంది రైతులకు 65 వేల కోట్ల పంట పెట్టుబడి సాయం. రైతుబీమా పథకం ద్వారా రూ.5 లక్షలు అందిస్తున్నాం. రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధిపై దేశవ్యాప్త చర్చ జరుగుతోంది. 2020-21 నాటికి 2,126 యూనిట్లకు తలసరి విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాధిస్తున్న సమ్మిళిత సమగ్రాభివృద్ధి యావత్ దేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ప్రతి రంగంలోనూ దేశం ఆశ్చర్యపోయే విధంగా అద్భుతమైన ప్రగతిని ఆవిష్కరిస్తూ పురోగమిస్తున్నదని చెప్పారు. ప్రజల ఆశీస్సులు, సీఎం కేసీఆర్ పరిపాలనా దక్షత వల్ల తెలంగాణ అపూర్వ విజయాలు సాధించిందన్నారు. ఒకప్పుడు కరెంటు కోతలతో అంధకారంలో కొట్టుమిట్టాడిన తెలంగాణ.. ప్రభుత్వ అవిరళ కృషితో నేడు 24 గంటల విద్యుత్ సరఫరాతో వెలుగు జిలుగుల రాష్ట్రంగా విరాజిల్లుతున్నదని చెప్పారు. వ్యవసాయం కుదేలై విలవిలలాడిన నేల.. నేడు దేశానికే అన్నం పెట్టే ధాన్యాగారంగా అవతరించిందని పేర్కొన్నారు. తాగునీటి కోసం తల్లడిల్లిన పరిస్థితుల నుంచి పూర్తిగా బయటపడి, 100 శాతం గ్రామాల్లో ఇంటింటికీ ఉచితంగా స్వచ్ఛమైన, సురక్షితమైన జలాలను సరఫరా చేస్తున్నది వెల్లడించారు. ఒకనాడు పాడుబడినట్టున్న తెలంగాణ గ్రామాల రూపురేఖలు మారి, నేడు అత్యున్నత జీవన ప్రమాణాలతో ఆదర్శవంతంగా తయారయ్యాయని తెలిపారు. పెట్టుబడులకు స్వర్గధామంగా, ప్రపంచ స్థాయి సంస్థలకు గమ్యస్థానంగా, ఐటీ రంగంలో మేటి రాష్ట్రంగా ప్రగతిపథంలో పరుగులు పెడుతున్నది. పర్యావరణ పరిరక్షణలోనూ, పచ్చదనం పెంపుదలలోనూ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నదని చెప్పారు. 2014-15లో రూ.62 వేల కోట్లుగా ఉన్న రాష్ట్ర ఆదయం.. ప్రభుత్వ కృషివల్ల 2021 నాటికి రూ.1 లక్షా 84 వేల కోట్లకు పెరిగిందన్నారు. రాష్ట్రం సిద్ధించేనాటికి రూ.లక్షా 24 వేలుగా ఉన్న తలసరి ఆదాయం.. 2022-23 నాటికి రూ.3.17 లక్షలకు చేరిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లోనూ అభివృద్ధి రెట్టింపుస్థాయిలో జరిగిందన్నారు. అన్నిరంగాల్లో పెట్టుబడి వ్యయాన్ని అధికంగా చేస్తూ అనూహ్యమైన ప్రగతిని సాధించిన ప్రభుత్వాన్ని అభినందించారు. తెలంగాణ అసెంబ్లీ డ్జెట్ సమావేశాలు ప్రారంభంలో ..ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు.

# ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి నివాసాల్లో సోదాలు



(మొదటి పేజీ తరువాయి) జీఎస్టీ చెల్లింపులపైనా ఐటీశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. రాజపుష్ప ప్రాపర్టీస్ తో పాటు వె÷-టర్గ÷క్స్, ముప్పా రియల్ ఎస్టేట్ సంస్థలు, వసుధ ఫార్మా కంపెనీ హెడ్ క్వార్టర్స్, డైరెక్టర్ల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. ముప్పా ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో ఐటీ అధికారుల తనిఖీలు చేశారు. ముప్పా మెలోడీస్ పేరుతో ముప్పా ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తెల్లాపూర్ లో భారీ ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. అఖీఖఈ బలగాల భద్రత మధ్య సోదాలు కొనసాగుతున్నాయి. రాజపుష్ప లైఫ్ స్టైల్ విల్లాస్ లో ఉంటున్న కంపెనీ డైరెక్టర్లు పి. శ్రీనివాస్ రెడ్డి, జయచంద్రారెడ్డి, చరణ్ రాజ్, ఎండీ మహేందర్ రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ సుజిత్ రెడ్డితో పాటు అకౌంటెంట్స్, సిబ్బంది ఇండ్లల్లో బుధవారం ఒకేసారి తనిఖీలు నిర్వహించారు. ఇదే విల్లాస్ లో ఉంటున్న వెంకట్రామిరెడ్డి ఇంట్లోనూ సోదాలు చేశారు. రాజపుష్ప ప్రాపర్టీస్ కు చెందిన దాదాపు 15 ప్రాంతాల్లో బుధవారం ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ సోదాలు నిర్వహించారు. రియల్ ఎస్టేట్ లో రాజపుష్ప కంపెనీ పెట్టుబడులు, ఐటీ చెల్లింపులపై అధికారులు తనిఖీలు చేస్తున్నారు. రాజ్ పుష్ప పలు సంస్థలతో ల్యాండ్ డెవలప్ మెంట్ అగ్రిమెంట్లు చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో రాజపుష్పతో పాటు ముప్పా , వె÷-టర్గ÷క్స్ కన్ స్ట్రక్షన్స్, వసుధ ఫార్మా కంపెనీల్లోనూ సోదాలు జరిపారు.

# అసెంబ్లీలో అరుదైన సన్నివేశం

### ఈటెలతో కెటిఆర్ సంభాషణ


**హుజూరాబాద్ సభకు రాకపోవడంపై ఆరా**

**ప్రోటోకాల్ పాటించడం లేదన్న ఈటెల, భట్టి**



**హైదరాబాద్, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. గవర్నర్ ప్రసంగానికి ముందు బీజేపీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, రాజాసింగ్‌తో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. వారి వద్దకు ప్రత్యేకంగా వెళ్లి మరీ ముచ్చటించారు. పలు అంశాలపై వారి మధ్య సంభాషణ జరిగింది. హుజూరాబాద్‌లో జరిగిన అధికారిక కార్యక్రమంలో ఎందుకు పాల్గొనలేదని ఈటలను మంత్రి కేటీఆర్ ప్రశ్నించగా.. అందుకు ఆయన పిలిస్తే కదా హాజరయ్యేది అని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో.. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అక్కడికి వెళ్లారు. తననూ అధికారిక కార్యక్రమాలకు పిలవడం లేదని చెప్పారు. కనీసం కలెక్టర్ నుంచైనా ఆహ్వానం లేదని ఈటల తెలిపారు. ఆ తర్వాత రాజాసింగ్, కేటీఆర్ మధ్య కూడా సరదా సంభాషణ జరిగింది. కాషాయ రంగు షర్ట్ వేసుకొచ్చిన రాజాసింగ్‌ను ఉద్దేశించి కేటీఆర్ ఫన్నీ కామెంట్స్ చేశారు. చౌక్కా రంగు కళ్లకు గుచ్చుకుంటుందని.. ఆ రంగు తనకుఇష్టం ఉండదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాషాయ రంగు చొక్కా భవిష్యత్‌లో మీరూ వేసుకోవచ్చేమో అని రాజాసింగ్ సరదాగా అనడం గమనార్హం. ఈ సమయంలో గవర్నర్ సభలోకి వస్తున్నారంటూ కేటీఆర్‌ను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అలెర్ట్ చేయడంతో... మంత్రి తన ట్రెజరీ బెంచీల వైపు వెళ్ళిపోయారు. కాగా.. కేటీఆర్ కంటే ముందే డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఈటల వద్దకొచ్చి ప్రత్యేకంగా మాట్లాడారు. అయితే ఈటల, కేటీఆర్‌ల సమావేశం ప్రస్తుతం రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది.

# విశ్వనాథ్ మృతికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు సంతాపం



(మొదటి పేజీ తరువాయి) సమయంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యం అందించాలని మంత్రులు ఆకాక్షించారు. దర్శక దిగ్గజం, కళాతపస్వి కే.విశ్వనాథ్ పార్థీవదేహానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాళులర్పించారు. ఆయ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యావత్ భారతదేశంలో విశ్వనాథ్‌కు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. కళలు, సామాజిక స్పృహ ఉన్న గొప్పవ్యక్తి అని, తన సినిమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. శంకరాభరణం చిత్రం ప్రతి ఒక్కరినీ కదిలించిందని తెలిపారు. విశ్వనాథ్‌ను అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు వరించాయని వెల్లడించారు. ఆయన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే చిత్రాలు తీశారన్నారు. ఆయన మృతి తెలుగు సినీ పరిశ్రమకు, అభిమానులకు తీరని లోటని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ గర్వించదగ్గ అరుదైన దర్శకుడు కే.విశ్వనాథ్ అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వారి మరణం తెలుగు సినిమా పరిశ్రమకు, ప్రేక్షకులకు తీరనిలోటన్నారు. సంప్రదాయ సంగీతానికి, సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ వారు రూపొందించిన చిత్రాలు ప్రేక్షకుల మదిలో ఎంతో కళాత్మకంగా నిలిచాయన్నారు. దాదా సాహెబ్ ఫాల్కే, రఘుపతి వెంకయ్య , పద్మ శ్రీ వంటి అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయన్నారు. విశ్వనాథ్ మృతిపట్ల మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు మల్లారెడ్డి, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్ రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. తెలుగుదనాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను అణువణువునా ప్రతిబింబించేలా అద్భుతమైన సినిమాలు అందించిన కళాతపస్వి, ప్రముఖ దర్శకులు కే.విశ్వనాథ్ మృతి బాధాకరమని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విశ్వనాథ్ గారిని కోల్పోవడం తెలుగు ప్రేక్షకులకి, సినీ పరిశ్రమకు తీరని లోటన్నారు. చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న విశ్వనాథ్ గారు, తెలుగు సినిమాల గొప్పతనాన్ని అంతర్జాతీయ వేదికలపైకి చేర్చారని కొనియాడారు. తెలుగు సినిమా ఉన్నంత వరకు ఆయన పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా, సంగీత సాహిత్యాలు ఇతివృత్తంగా ఆయన అందించిన సినిమాలు అత్యంత ఉత్తమమైనవని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. విశ్వనాథ్ గారి సినిమాలతో తెలుగు సినిమా ఖ్యాతి ప్రపంచ స్థాయికి వెళ్లిందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు పొంది తెలుగువారి గొప్పతనాన్ని దశదిశలా చాటారని తెలిపారు. సినిమా రంగానికి ఆయన చేసిన కృషికి పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే, రఘుపతి వెంకయ్య, ఐదు జాతీయ, ఐదు నంది, పది ఫిల్మ్‌ఫేర్ అవార్డులతోపాటు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఆయనను వరించాయని పేర్కొన్నారు. సినిమా ఉన్నంత కాలం ఆయన జనంతో ఉంటారని, ఆయన తీసిన సినిమాలు ఈ సమాజాన్ని ఎప్పటికీ చైతన్య పరుస్తునే ఉంటాయని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థించారు. విశ్వనాథ్ మృతి పట్ల మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు చిత్రాల స్థాయిని అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లిన గొప్ప దర్శకులని చెప్పారు. వెండి తెరకు కళాతపస్వి, కళల కోసం తపించే కే.విశ్వనాథ్ లేరనే వార్త కలచివేసిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తాను విశ్వనాథ్ గారి అభిమానిని, వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు. సంగీత, సాహిత్యాలకు పెద్దపీట వేస్తూ సామాన్యుల జీవనాన్ని ఇతివృత్తంగా వెండితెరపై మలచిన తీరు కే. విశ్వనాథ్ ప్రతిభకు నిదర్శనమని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కళాత్మక చిత్రాలను సైతం కమర్షియల్ సినిమా స్థాయిలో విజయవంతం చేయడం ఆయనకే సాధ్యమైందని చెప్పారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కె. విశ్వనాథ్ మృతిపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా వాగ్గేయకార దర్శకులు, కళామతల్లి ముద్దుబిడ్డ కళా తపస్వి కె. విశ్వనాథ్ మరణం తెలుగువారికి తీరని లోటు అని అన్నారు. 'కె. విశ్వనాథ్ ఆత్మకు సద్గతులు కలగాలని భగవంతుడుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అంటూ వివేక్ వెంకటస్వామి ట్వీట్ చేశారు. 'పుట్టిన ప్రతివాడికి మరణం తప్పదు. కానీ విశ్వనాథ్ గారి మరణం చాలా గొప్పది.- ఆయన సినిమాల్లో నేను నటించాను. ఎప్పుడు ఆప్యాయంగా పలకరించేవారు. ఆయన కుటుంబంతో గడిపిన క్షణాలు మర్చిపోలేను. ఆయన లేడు అనేది చాలా బాధాకరం. భారతీయ చలన చిత్రాలలో విరబూసిన కమలం ఆయన' అని బ్రహ్మానందం అన్నారు. 'కె.విశ్వనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు నటి రాధిక తెలిపారు. తీవ్రమైన అలల మధ్య కూడా చాలా ప్రశాంతంగా ఉండే గొప్ప వ్యక్తి ఆయన. ఆయనతో పని చేసిన రోజుల్ని ఎప్పటికి మర్చిపోలేను' అంటూ సినీ నటి రాధక అన్నారు. 'విశ్వనాథ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయనతో మాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన సినిమా పాటలే నన్ను ఇండస్ట్రీలోకి తీసుకొచ్చాయి. విశ్వనాథ్ ప్రతి సినిమా మనకు ఒక ఆదర్శం' అని పాటల రచయిత చంద్రబోస్ అన్నారు. తన భార్య ఆయన ఎన్నో పాటలకు నృత్యదర్శకురాలిగా పనిచేసిందన్నారు.

# మాజీ సిఎస్ సోమేశ్‌కు హైకోర్టు వారెంట్



(మొదటి పేజీ తరువాయి) ఒక ప్లాట్‌కు సంబంధించిన వ్యవహారంలో కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. కోర్టుకు హాజరుకావాలని పలుమార్లు ఆదేశించిన సోమేష్ కుమార్ గైర్హాజరయ్యారు. దీంతో సోమేశ్ కుమార్‌కు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. రాష్ట్ర సీఎస్‌గా ఉన్న సోమేష్‌ను హైకోర్టు ఏపీకి వెళ్లాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన ఏపీలో రిపోర్ట్ చేసి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు.

# బిబిసి డాక్యుమెంటరీ నిషేధంపై విచారణ

(మొదటి పేజీ తరువాయి) రామ్, కార్యకర్త లాయర్ ప్రశాంత్ భూషణ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా వేర్వేరుగా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీం నోటీసులు జారీ చేసింది. బీబీసీ డాక్యుమెంటరీని సెన్సారింగ్ చేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని నిలువరించాలంటూ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. కేసు తదుపరి విచారణను వచ్చే ఏప్రిల్‌లో చేపట్టనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. కాగా, గుజరాత్‌లోని గోద్రాలో 2002లో అల్లర్లు చోటుచేసు కున్నాయి. ఈ ఘటన అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. దీనిపై బీబీసీ తాజాగా ఒక డాక్యుమెంటరీని రూపొందించింది. అయితే, ఆ డాక్యుమెంటరీలో అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న ప్రధాని మోదీకి, గుజరాత్ హోంమంత్రిగా ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సంబంధించి కొన్ని అభ్యంతరకర విషయాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం డాక్యుమెంటరీని సెన్సార్ చేయకుండా అడ్డుకోవాలంటూ బీబీసీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. దాంతో కోర్టు కేంద్రానికి తాజా ఆదేశాలు జారీచేసింది.



**ఇంటి స్థలం ఉన్న నిరుపేదలందరికీ**

# ఐదు లక్షలు ఇవ్వాలి

**రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం**

**మునుగోడు, ఫిబ్రవరి 3 (సమ సమాజం):** సొంత ఇంటి స్థలం కలిగి ఉన్న నిరుపేదలందరికీ ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు . అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కృష్ణారెడ్డికి



అందజేశారు. ఈ సందర్భంగా బండ శ్రీశైలం మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం సొంత ఇంటి స్థలం ఉన్నవారికి 3 లక్షల రూపాయలు ఇస్తానని చెప్పడం సరైనది కాదని అన్నారు పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇచ్చి, నిరుపేదలను ఆదుకోవాలనిఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు రైతు సంఘం నాయకులు సాగర్ల మల్లేష్, వడ్లమూడి హనుమయ్య, సిహెచ్ వీరమల్లు, నార బోయిన నరసింహ, బొందు అంజయ్య, మాజీ సర్పంచ్ సింగపంగా గౌరయ్య, బోడిసే సత్తయ్య, బొందు ముత్యాలు, సిహెచ్ రజిత, ఇరగదిండ్ల ఇద్దయ్యా, పగిళ్ల సైదులు, జీడిమెట్ల సైదులు తదితరులు ఉన్నారు.

# ఆసియా కప్ నిర్వహణ అస్పష్టత

## బహ్రెయిన్ సదస్సులో నిర్ణయించే ఛాన్స్




ముంబై,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది ఆసియా కప్ నిర్వహణ విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. దాంతో, టోర్నీకి ఏ దేశం ఆతిథ్యం ఇవ్వనుంది? పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వాల్సిన ఈ టోర్నమెంట్ భవితవ్యం ఏంటి? అనే సందేహాలు చాలమందికి ఉన్నాయి. అయితే.. త్వరలోనే ఒక క్లారిటీ రానున్నట్టు సమాచారం. ఆసియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అత్యవసర సమావేశంలో ఆసియా కప్ నిర్వహణపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. శనివారం బహ్రెయిన్‌లో జరగనున్న ఈ సమావేశానికి పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడు నజం సేథీ పిలుపునిచ్చాడు. దుబాయ్‌లో జరగనున్న ఐఎల్‌టీ 20 ప్రారంభ వేడుకల సందర్భంగా ఏఆసియా కప్ వేదికపై ఒక అంగీకారానికి రావాలని ఏసీసీ చీఫ్, ఇతర సభ్యులను నజం సేథీ కోరనున్నాడు. దాంతో రేపు జరగబోయే ఏసీసీ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆసియా కప్ నిర్వహణపై సందిగ్ధత నెలకొనడానికి ఏసీసీ అధ్యక్షుడు, బీసీసీఐ కార్యదర్శి జై షా వ్యాఖ్యలే కారణం. టీ20 వరల్డ్ కప్ తర్వాత ఆయన 2023 ఆసియా కప్‌కి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వడం లేదని, తటస్థ వేదిక మీద టోర్నమెంట్ జరగుతుందనిస్పష్టం చేశాడు. దాంతో, జై షా వ్యాఖ్యలు దుమారం రేపాయి. అప్పటి పాక్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు రమీజ్ రాజాతో పాటు పలువురు పాక్ క్రికెటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ అదే జరిగితే భారత్‌లో జరగనున్న వన్డే వరల్డ్ కప్‌లో తమ జట్టు ఆడదని తెలిపారు. పోయిన ఏడాది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆతిథ్యం ఇచ్చింది. దాంతో, ఈ ఏడాది కూడా ఆ దేశంలోనే ఈ టోర్నమెంట్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈమధ్యే ఫుట్‌బాల్ వరల్డ్ కప్ పోటీలు నిర్వహించిన ఖతర్ కూడా ఆసియా కప్ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చేందుకు ఆసక్తి కనబరుస్తోంది.

# వచ్చే వరల్డ్ కప్ ఆడుకాక ఆడను

## వయసురీత్యా అది సాధ్యం కాదన్న మెస్సీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): అర్జెంటీనాకు మూడో వరల్డ్ కప్ అందించిన లియోనల్ మెస్సీ వచ్చే వరల్డ్ కప్ కూడా ఆడాలని అభిమానులందరూ కోరుకుంటున్నారు. అయితే.. అతను మాత్రం ఫ్యాన్స్‌ను నిరాశ పరిచే వార్త చెప్పాడు. ఆ మెగా టోర్నీలో ఆడడంపై తాజాగా స్పందించిన మెస్సీ వయసురీత్యా తాను 2026 వరల్డ్ కప్‌లో ఆడడం కష్టమే అని అన్నాడు. 'నాకు ఫుట్‌బాల్ ఆడడం అంటే చాలా ఇష్టం. ఇప్పుడు నా శరీరం సహకరిస్తోంది కాబట్టి ఆటను ఆస్వాదిస్తున్నా. అయితే.. 2026 వరల్డ్ కప్‌లో ఆడడం వయసురీత్యా నాకు కష్టమే' అని మెస్సీ తెలిపాడు. ఇప్పుడు మెస్సీకి 35 ఏళ్లు. 2026 ఫిఫా వరల్డ్ కప్ వచ్చే సరికి అతనికి 38 ఏళ్లు. మెస్సీ కెప్టెన్సీలోని అర్జెంటీనానా ఖతర్‌లో జరిగిన ఫిఫా వరల్డ్ కప్ ఛాంపియన్‌గా అవతరించింది. మూడోసారి వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా రికార్డు క్రియేట్ చేసింది. ఉత్కంఠ పోరులో షూటౌట్‌లో 4–2తో ఫ్రాన్స్‌ను ఓడించింది. మెస్సీ రెండు గోల్స్ కొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వరల్డ్ కప్ ట్రోఫీని ముద్దాడాలన్న తన 8 ఏళ్ల కలను ఈ స్టార్ ప్లేయర్ నిజం చేసుకున్నాడు. 2014లో మెస్సీ అర్జెంటీనాను ఫైనల్ చేర్చాడు. కానీ, ఫనల్లో జర్మనీ కప్పు ఎగరేసుకుపోయింది.




# భవిష్యత్ ధృవతార శుభమన్ గిల్

## ప్రశంసలు కురిపించిన విరాట్ కోహ్లీ

ముంబై,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన నిర్ణాయక టీ20లో శతక్కొట్టి భారత్ సిరీస్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్‌పై టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. గిల్‌ను భవిష్యత్ తార అంటూ కొనియాడాడు. కివీస్‌పై 63 బంతుల్లోనే 126 పరుగులు చేసిన గిల్.. ఓ టీ20 మ్యాచ్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన భారత బ్యాటర్‌గా కోహ్లీ (122 నాటౌట్, ఆఫ్ఘనిస్థాన్‌పై) రికార్డును అధిగమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గిల్‌తో తానున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పోస్ట్ చేసిన విరాట్.. 'సితార.. భవిష్యత్ ఇక్కడ' అని కామెంట్ చేశాడు. ఇక కివీస్ టీ20 సిరీస్‌కు దూరమైన విరాట్.. ఆ విరామంలో భార్య అనుష్క శర్మ, కూతురు వామికతో కలిసి ట్రెక్కింగ్ ట్రిప్‌కు వెళ్లాడు. ఆ వెకేషన్‌ను పూర్తి చేసుకొని బుధవారమే ముంబై చేరుకున్నాడు.







---




# యాక్షన్ ఒరియంటెడ్ సినిమా మైఖేల్


## హీరో సందీప్ కిషన్ వెల్లడి


పదమూడేళ్ల కెరీర్‌లో ఫస్ట్ టైమ్ యాక్షన్ ప్యాక్డ్ క్యారెక్టర్‌లో కనిపిస్తున్నా అన్నాడు సందీప్ కిషన్. రంజిత్ జయకోడి దర్శకత్వంలో తను నటించిన 'మైఖేల్' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా సందీప్ చెప్పిన విశేషాలు. ఇదొక యూనిక్ స్టోరీ. చాలా వైల్డ్‌గా, కొత్త నెరేటివ్ స్టయిల్‌లో ఉంటుంది. నేను అగ్రెసివ్‌గా కనిపిస్తాను. యాక్షన్ చాలా ఫ్రెష్‌గా, రియలిస్టిక్ వైబ్‌తో ఉంటుంది. విజువల్‌గా ఎక్సయిటింగ్‌గానూ ఉంటుంది. ఇందులో ఉన్న సీన్స్ నిజంగా జరిగితే ఎలా ఉంటుందని ఊహించి చేశా. యాక్షన్‌తో పాటు ఎమోషన్స్ కూడా బలంగా ఉంటాయి. ఈ సినిమాలో అందరూ బ్యాడ్ గయ్స్. బ్యాడ్ పీపుల్స్ మధ్య జరిగే ప్రేమ కథ ఇది. ఇందులో డార్క్ కామెడీ ఉంటుంది. 'మైఖేల్'కి ఫ్రెండ్స్ ఎవరూ ఉండరు. ఎవరితో మాట్లాడడు. విజయ్ సేతుపతి, వరలక్ష్మి శరత్‌కుమార్ జంటగా కనిపిస్తారు. వీళ్లిద్దరి పాత్రలు హైలైట్. గౌతమ్ మీనన్ క్యారెక్టర్ ఫ్రెష్‌గా ఉంటుంది. అలాగే వరుణ్ సందేశ్ కూడా ఇలాంటి పాత్ర ఎప్పుడూ చేయలేదు. దివ్యాంశ కౌశిక్ పాత్ర కూడా ట్రిక్కీగా ఉంటుంది. వీళ్ళంతా కథ, దర్శకుడిపై నమ్మకంతోనే నటించారు. స్క్రీన్‌ప్లే ఊహించిన దానికంటే సర్‌ప్రైజ్‌గా ఉంటుంది. నిర్మాతలు భరత్ చౌదరి, పుస్కూరు రామ్మోహన్ రావు సపోర్ట్‌తో 'మైఖేల్'ని సక్సెస్ చేయడమే టా÷–గ్గ÷ట్‌గా వర్క్ చేశాం. ఈ కథకి పాన్ ఇండియా కెపాసిటీ ఉంది. అందుకే అన్ని భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నేనే డబ్బింగ్ చెప్పా. ఈ జర్నీని చాలా ఎంజాయ్ చేశా. బరువు తగ్గడంతో పాటు స్కూబా డైవింగ్ నేర్చుకున్నాను. ఇక ప్రస్తుతం భైరవ కోన, బడ్డీ, కెప్టెన్ మిల్లర్ సినిమాలు చేస్తున్నా. ఈ మూడు డిఫరెంట్ స్టోరీలే. దీనితో పాటు 'ఫ్యామిలీ మ్యాన్ 3' ఉంది. అలాగే త్వరలోనే మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ రాబోతుంది.



# మనమధ్యే తచ్చాడే పాత్రలు

## అవే విశ్వనాథ్ సినిమా కథలు





సినిమాలను ఆహ్లాదం కోసమే కాదు.. ఆలోచించేవిధంగా కూడా తీయొచ్చని తెలుగు సినిమా స్థాయిని పెంచిన దర్శకుడు కే. విశ్వనాథ్ గారు. ఆయన సినిమాలు మనతో మాట్లాడతాయి, ప్రశ్నిస్తాయి, కష్టపడితే విజయం మనదే అనే ధైర్యాన్నిస్తాయి. సమాజంలోని సమస్యలే ఆయన సినిమాలు. ఆచారాలకంటే మనవత్యం గొప్పదని 'శంకరాభరణం'తో చాటి చెప్పాడు. మనుషులను విడదీసే కుల వ్యవస్థను నిర్మూలించాలని 'సప్తపది' తెరకెక్కించాడు. కష్టపడితే ఏదైనా సాధించొచ్చు అని 'స్వయంకృషి'తో తెలియజేశాడు. అవినీతి అక్రమాలను ఎదుర్కోవడానికి హింస మార్గం కాదని, శాంతియుత మార్గమే సరైనదని 'సూత్రధారులు' సినిమాతో భోదించాడు.



ఇలా చెప్పుకుంటూ పోతే కళాతపస్వి జ్ఞానంలో నుండి వచ్చిన ప్రతీ కథ ఒక పాఠమే. తొలి సినిమా ఆత్మగౌరవం నుండి దర్శకుడిగా వందకు వంద మార్కులు సంపాదించుకున్నాడు. గొప్ప దర్శకుడు అవ్వాలంటే వందలకు పైగా సినిమాలు తీయక్కర్లేదు. వంద మంది గుర్తుపెట్టుకునే సినిమా తీయాలి అని ఆయన సినిమాలు చూస్తే తెలుస్తుంది. ఆయన ఫిల్మోగ్రఫిలో ప్రతీ సినిమా ఒక అద్భుతమే. 'ఆత్మగౌరవం' సినిమాతో దర్శకుడిగా తన సినీ ప్రయాణాన్ని మొదలు పెట్టిన కళాతపస్వి.. ఐదు దశాబ్దాల్లో 50పైగా చిత్రాలను తెరకెక్కించాడు. తొలి సినిమాతోనే ప్రతిభగల దర్శకుడిగా ముద్ర వేసుకున్నాడు. శంకరాభరణం, సప్త పది, సిరిసిరి మువ్వలు, స్వాతి ముత్యం, సాగర సంగమం, స్వయం కృషి వంటి పలు సినిమాలతో తెలుగు సినిమా స్థాయిని పెంచాడు. ఇక కే. విశ్వనాథ్ గారి చివరి చిత్రం శుభప్రదం. శ్రీకాంత్‌తో 'స్వరాభిషేకం' తర్వాత దాదాపు ఆరేళ్లు గ్యాప్ తీసుకుని 'శుభప్రదం' సినిమాను తెరకెక్కించాడు. అల్లరి నరేష్, మంజారి ఫడ్నిస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా 2010 జూలై 16న రిలీజైంది. కమర్షియల్‌గా ఈ సినిమా అంతగా ఆడకపోయినా.. విమర్శకుల నుండి ప్రశంసలు పొందింది. ఇదే కళాతపస్వి మెగాఫోన్ పట్టిన చివరి చిత్రం. ఇక నటుడుగా దాదాపు 31 సినిమాల్లో నటించాడు. ఆయన నటించిన చివరి చిత్రం 'హైపర్'. ఈ సినిమాలో సీ.ఎం పాత్రలో నటించాడు. తెలుగులోనే కాకుండా హిందీలోనూ విశ్వనాథ్ పలు సినిమాలకు దర్శకత్వం వహించాడు.






Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in